దేశభక్తిని పెంపొందించుకోవాలి

● మాజీ కేంద్ర మంత్రి వేణుగోపాలాచారి

అవార్డులు బహూకరిస్తున్న వేణుగోపాలాచారి, అతిథులు

రవీంద్రభారతి, జనవరి 9 : యువత దేశభక్తిని పెంపొందించుకోవాలని మాజీ కేంద్ర మంత్రి బీఆర్ఎస్ నేత డా.సముద్రాల వేణుగోపాలాచారి అన్నారు. గురువారం సంక్రాంతి సంబురాలు, గణతంత్ర దినోత్సవ వేడుకలను గ్లోబల్ ఈవెంట్స్ ఆధ్వర్యంలో వ్యవస్థాపక అధ్యక్షుడు లయన్ కే.వీ. రమణారావు నిర్వహణలో రవీంద్రభారతిలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అతిథులుగా డా. వేణుగోపాలచారి పాల్గొని కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ పిల్లలకు ఆసక్తి ఉన్న కళలను నేర్పించాలని తెలిపారు. పిల్లలకు శిక్షణనిస్తున్న గురువులను, కళాకారులుగా తమ ప్రవిభను చాటుకోవడానికి రవీంద్రభారతి వంటి జాతీయ వేదికలను అందిస్తున్న ఏబీసీ ఫౌండేషన్, గ్లోబల్ ఈవెంట్స్, భారత్ ఆర్ట్స్ అకాడమీ, జై జవాన్ జైకిసాన్, జైకళాకార్ సంస్థల అధినేత రమణారావును ఆయన అభినందించారు. సభకు ముందు 12మంది నాట్యగురువులను ఘనంగా సత్కరించారు. చకిలం సుధాకర్, డా.పద్మిని నాగులపల్లి, మానస్, సత్యంగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

రక్త దానం

తలసీమియా బాధితుల కోసం రక్త దానం చేస్తున్న దాతలు

అబిడ్స్, జనవరి 9 : రక్తం దానం మహాదానమని, అవసరమైన రోగుల ప్రణాలకు ఈ రక్తదానం ఆధారంగా నిలుస్తుందని ఫెర్నాండెజ్ ఫౌండేషన్ అడ్మినిస్ట్రేషన్ అండ్ ఆపరేషన్స్ అసోసియేట్ డైరెక్టర్ డాక్టర్ తేజస్విని కుష్నూర్‌అన్నారు. ఫెర్నాండెజ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో తలసీమియా, సికిల్ సెల్ సొసైటీ సహకారంతో రక్తదాన కార్యక్రమాన్ని నిర్వహించగా వంద మంది రక్తదాతలు ముందుకు వచ్చి రక్తదానం చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. స్వచ్ఛంద సేవకులు క్రమం తప్పకుండా రక్తదానం చేయడం యొక్క ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. తలసేమియా సికిల్ సెల్ సొసైటీ జాయింట్ సెక్రటరీ అలీమ్ బేగ్ మాట్లాడుతూ.. దీర్ఘకాలిక రక్త రుగ్మతలు ఉన్న వారికి నిరంతరం రక్తమార్చిడి అవసరమన్నారు. తలసేమియా, సికిల్ సెల్ వ్యాధితో బాధపడుతున్న వారికి రక్త సరఫరాను అందించడం కోసమే ఈ రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఈ సందర్భంగా రక్తదానం చేసిన వారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

కేటీఆర్‌కు మద్దతుగా తెలంగాణ భవన్‌కు తరలిన బీఆర్ఎస్ నాయకులు

తెలంగాణభవన్‌లో మాట్లాడుతున్న అంబర్‌పేట కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్

నాంపల్లి నియోజకవర్గం బీఆర్ఎస్ ఇన్‌చార్జి సీహెచ్. ఆనంద్‌కుమార్‌గౌడ్

మెహిదీపట్నం, జనవరి 9 : బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై కాంగ్రెస్ ప్రభుత్వం కక్ష పూరితంగా వ్యవహరిస్తున్నదని, తెలంగాణ ప్రజలు సీఎం రేవంత్ చర్యలను గమనిస్తున్నారని నాంపల్లి నియోజకవర్గం బీఆర్ఎస్ ఇన్‌చార్జి సీహెచ్.ఆనంద్‌కుమార్‌గౌడ్ అన్నారు. గురువారం కేటీఆర్‌కు మద్దతుగా నాంపల్లి, కార్వాన్ నియోజకవర్గాల బీఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు బీఆర్ఎస్ భవన్‌కు తరలివెళ్లారు.

రాజకీయ కక్షతోనే కేటీఆర్‌పై తప్పుడు కేసులు..

గోల్నాక : కేవలం రాజకీయ కక్షతోనే సీఎం రేవంత్ రెడ్డి సర్కార్ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై తప్పుడు కేసులు పెడుతున్నారని అంబర్‌పేట డివిజన్ కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్ ఆరోపించారు. గురువారం ఆయన తెలంగాణ భవన్‌లో మాట్లాడారు. సీఎం రేవంత్ రెడ్డి దిగజారుడు రాజకీయాలతో అక్రమ కేసులు పెట్టి అరెస్ట్ చేయాలని చూస్తే ప్రజలు తగిన బుద్ధి చెబుతారని ఆయన అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం దుర్మార్గాలను ప్రజాక్షేత్రంలో తేల్చుకుంటామని ఆయన తెలిపారు. కార్పొరేటర్ వెంట అంబర్‌పేట బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

హామీలు నెరవేర్చలేకనే కేటీఆర్‌పై కుట్ర పూరిత కేసులు..

కాచిగూడ : భూటకపు వాగ్దానాలతో అధికారంలోకి వచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చలేకనే మాజీ మంత్రి కేటీఆర్‌పై కుట్ర పూరితమైన కేసులు పెడుతున్నారని బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ధాత్రిక్ నాగేందర్‌బాబ్జి అన్నారు. గురువారం చెప్పల్‌బజార్‌లో బబ్లూసింగ్‌తో కలిసి ఆయన మాట్లాడుతూ.. మాజీ మంత్రి కేటీఆర్‌కు మద్దతుగా నిలుస్తామని అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టి ఏడాది గడుస్తున్నా ఆరు గ్యారంటీలు అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.

తెలుగుతల్లి విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాగేందర్‌బాబ్జి, బబ్లూసింగ్, రాజేశ్ తదితరులు

జియాగూడ మేకల వధశాలను ఆధునీకరించాలి

అభివాదం చేస్తున్న అసోసియేషన్ సంఘ అధ్యక్షుడు కె. శ్రీనివాస్‌కుమార్

రవీంద్రభారతి, జనవరి 9 : రాష్ట్ర ప్రభుత్వం హైదరాబాద్ జియాగూడలోని మేకల వధశాలను ఆధునీకరించి అభివృద్ధి చేయాలని ఆరే కటిక మండేదార్ అసోసియేషన్, ఆరేకటిక చరంకార్ సంఘం నేతలు విజ్ఞప్తి చేశారు. గురువారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో అసోసియేషన్ సంఘ అధ్యక్షుడు కే.శ్రీనివాస్‌కుమార్, జనరల్ సెక్రటరీలు జి.అశోక్‌కుమార్, పి.దర్శన్, వైస్‌ప్రెసిడెంట్ వి.శశికాంత్‌రావు మాట్లాడారు. ఈ సందర్భంగా కె.శ్రీనివాస్‌కుమార్ మాట్లాడుతూ.. వేలాది మంది ఆరే కటికలు, ఎస్సీ, ఎస్టీ, గొల్ల కురుమలు, మైనార్టీ ప్రజలకు ఉపాధి కల్పిస్తున్న మేకల వధశాలను తక్షణమే ప్రభుత్వం ఆధునీకరించి అభివృద్ధి చేయాలని డిమాండ్ చేశారు. తమ డిమాండ్లను నెరవేర్చాలని కోరూతూ వేలాది మందితో ధర్నా చేపట్టి అనంతరం బషీర్ బాగ్ ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశం నిర్వహించామని ఆయన పేర్కొన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఆదేశానుసారం. జియాగూడ మినహా బోయిగూడ, అంబర్‌పేట, గౌలిపురలో ఉన్న ఐదింటితో పాటు రాంనాన్‌పురాలోని బీఫ్ వధాశాలను అప్పటి ప్రభుత్వం ఆధునీకరించిందని తెలిపారు. ఈ మేకల వధశాలలో మేకలు, గొర్రెలు, పార్కింగ్ విక్రయం ద్వారా జీహెచ్ఎంసీకి ఏటా రూ.3వేల కోట్ల ఆదాయం అందుతుందని తెలిపారు. 20 ఏండ్లుగా ఏ ప్రభుత్వం కూడా తమకు ఆర్థిక సాయం, రాయితీలు ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే కాంగ్రెస్ ప్రభుత్వం వేలాది మందికి ఉపాధి కల్పిస్తున్న మేకల వధశాలను ఆధునీకరించాలని, లేకుంటే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమం చేస్తామని ఆయన ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

కుస్తీ పోటీలకు రావాలని సీఎంకు ఆహ్వానం

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఆహ్వానం అందజేసిన కుస్తీ నిర్వాహకులు అశోక్ తదితరులు

కార్వాన్, జనవరి 9 : ఈ నెల 20వ తేదీ నుంచి 23 వరకు 4 రోజుల పాటు తాళ్లగడ్డలోని రాజలింగయ్య కబడ్డీ స్టేడియంలో కుస్తీ పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు అశోక్ పహిల్వాన్ తెలిపారు. ఈ కుస్తీ పోటీలకు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ముఖ్య అతిథిగా హాజరు కావాలని కోరుతూ.. గురువారం సీఎం రేవంత్ రెడ్డిని కలిసి ఆహ్వానపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అశోక్ పహిల్వాన్ మాట్లాడుతూ.. మద్దెల రాజస్వామి, మైసయ్య పహిల్వాన్, యాదయ్య పహిల్వాన్‌ల జ్ఞాపకార్థం ఈ కుస్తీ టోర్నమెంట్‌ను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కబడ్డీ స్టేడియంలో జనవరి 20వ తేదీన కుస్తీ వీరుల పేర్లు నమోదు ఉంటుందని 21 నుంచి 24 వ తేదీ వరకు మూడు రోజుల పాటు కుస్తీ పోటీలు ఉంటాయన్నారు. 32 కేజీల నుంచి 86 కేజీల వరకు కుస్తీ పోటీలలో పాల్గొనవచ్చు. మైసయ్య పహిల్వాన్ కేసరి టైటిల్ మొదటి బహుమతి రూ. 31000 నగదు, రెండవ బహుమతి రూ. 21,000, తృతీయ బహుమతి రూ. 11,000ల నగదు అదే విధంగా యాదయ్య పహిల్వాన్ బాల కేసరీ టైటిల్ మొదటి విజేతకు రూ. 21000 నగదు, రెండవ రూ. 11,000, తృతీయ రూ. 5,000ల నగదు బహుమతులు ఉంటాయన్నారు. ఇదే కాక పలు విభాగాలలో ప్రతిభ కనబరిచిన కుస్తీ వీరులకు ప్రోత్సాహక బహుమతులు అందజేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో బాబూరావు, నర్సింగ్, గోపాల్, గజేందర్, వెంకటేశ్ పాల్గొన్నారు.

'సామాజిక శాస్త్రంలో కెరీర్'పై ఉపన్యాసం

సుల్తాన్‌బజార్, జనవరి 9 : సామాజిక శాస్త్రంలో కెరీర్‌ను నిర్మించడం అనే అంశం విద్యార్థులకు భవిష్యత్ విజయానికి ఒక మార్గదర్శిగా నిలుస్తుందని విద్యావేత్త, టెక్సాస్ విశ్వ విద్యాలయం ప్రొఫెసర్ పసుపులేటి సుదర్శన్ అన్నారు. ఈ మేరకు గురువారం నిజాం కళాశాల సోషియాలజీ విభాగం ఆధ్వర్యంలో కళాశాల సెంటినరీ బ్లాక్ ఆడిటోరియంలో సామాజిక శాస్త్రంతో కెరీర్‌లను నిర్మించడం, అవకాశాలు, మార్గాలు, వాటి ప్రభావం అనే అంశంపై అతిథి ఉపన్యాస కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ.. సామాజిక శాస్త్రాలను అభ్యసించే విద్యార్థులను ప్రేరేపించే లక్ష్యంతో చేసిన ఈ ఉపన్యాస కార్యక్రమం విద్యార్థులకు ఎంతగానో దోహదం చేస్తుందని అన్నారు. సోషల్ సైన్స్ విద్యార్థులకు అందుబాటులో ఉన్న విభిన్న కెరీర్ అవకాశాలు, మార్గాలపై విశ్లేషించారు. ఈ కార్యక్రమంలో నిజాం కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఏవీ రాజ శేఖర్, వైస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జి. ఉపేందర్‌రెడ్డి, సోషియాలజీ విభాగాధిపతి డాక్టర్ తిరుపతి, కళాశాల పీఆర్‌వో డాక్టర్ కవితా షిండేతో పాటు బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

ప్రొఫెసర్ పసుపులేటి సుదర్శన్‌ను సన్మానిస్తున్న నిజాం కళాశాల ప్రిన్సిపాల్ ఏవీ రాజశేఖర్, వైస్ ప్రిన్సిపాల్ జి. ఉపేందర్‌రెడ్డి

అయ్యప్పస్వామి మాలధారుడిపై దాడి

న్యాయంచేయాలని గోల్కొండ పోలీస్ స్టేషన్ వద్ద ధర్నాచేస్తున్న అయ్యప్ప మాలధారులు

మెహిదీపట్నం, జనవరి 9 : అప్పుగా ఇచ్చిన డబ్బులు అడగడానికి వెళ్లిన ఓ అయ్యప్ప స్వామి మాలధారుడిపై అష్రఫ్ అనేవ్యక్తి తన కుటుంబ సభ్యులతో కలిసి మూకుమ్మడిగా దాడి చేసి తీవ్రంగా కొట్టిన ఘటన గోల్కొండ పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం చోటు చేసుకున్నది. మాలలో ఉన్న కొట్టకండి అంటూ మొర పెట్టుకున్నా వినకుండా కొట్టారని సదరు బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గోల్కొండ ఇబ్రహీంబాగ్‌లో నివసించే నరేశ్ సాఫ్ట్‌వేర్. ఇతడు తన ఇంటి సమీపంలో నివసించే అష్రఫ్‌కు 4 సంవత్సరాల క్రితం రూ.2 లక్షలు అప్పుగా ఇచ్చాడు. అప్పటి నుంచి డబ్బులు తిరిగి ఇవ్వాలని అష్రఫ్‌ను నరేశ్ అడుగుతూనే ఉన్నాడు. గురువారం ఉదయం అష్రఫ్ ఇంటికి వెళ్లిన నరేశ్‌ను అష్రఫ్‌తో పాటు అతడి కుటుంబ సభ్యులు ఆరుగురు కలిసి దాడి చేసి తీవ్రంగా కొట్టారు. అయ్యప్ప మాలలో ఉన్నా అని చెప్పినా వినకుండా దాడి చేసి కొట్టారు. దీంతో బాధితుడు తనకు న్యాయం చేయాలని గోల్కొండ పోలీస్ స్టేషన్‌కు వెళ్లి అష్రఫ్ కుటుంబ సభ్యులపై ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఈఎం రేడియేషన్, సైబర్ భద్రతపై అవగాహన

మెథడిస్ట్ ఇంజినీరింగ్ కళాశాలలో ఈఎం రేడియేషన్, సైబర్ భద్రతపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న అధ్యాపకులు, విద్యార్థులు

అబిడ్స్, జనవరి 9 : అబిడ్స్‌లోని మెథడిస్ట్ ఇంజినీరింగ్ కళాశాలలో ఈఎం రేడియేషన సైబర్ భద్రతపై అవగాహన సదస్సు నిర్వహించారు. మెథడిస్ట్ ఇంజినీరింగ్ కళాశాల, డిపార్ట్‌మెంట్ ఆఫ్ టెలికమ్యూనికేషన్స్, సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్ సహకారంతో విద్యుదయస్కాంత రేడియేషన్, సైబర్ భద్రతపై నిర్వహించిన అవగాహన కార్యక్రమం విజయవంతమైంది. ఇంటర్నల్ క్వాలిటీ అష్యూరెన్స్ సెల్, ఎలక్ట్రానిక్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ విభాగం నిర్వహించిన ఈ కార్యక్రమంలో రేడియేషన్, సైబర్ భద్రతా ముప్పుతో సంబంధం ఉన్న సంభావ్య ప్రమాదాల గురించి విద్యార్థులు, అధ్యాపకులకు అవగాహన కల్పించడం, ఈఎం రేడియేషన్‌కు గురి కావడాన్ని ఎలా తగ్గించుకోవాలో, సైబర్ ముప్పుల నుంచి తమను తాము ఎలా రక్షించుకోవాలో అనే అంశాలపై అవగాహన కల్పించారు. ఈఎం రేడియేషన్ దాని మూలాలలను అర్థం చేసుకోవడం, ఈఎం రేడియేషన్‌కు దీర్ఘకాలికంగా గురి కావడం వలన కలిగే ఆరోగ్యపరమైన చిక్కులు. ఈఎం రేడియేషన్ ఎక్స్‌పోజర్‌ను తగ్గించడానికి భద్రతా చర్యలు, సాధారణ సైబర్ భద్రతా ముప్పును గుర్తించడం, నిరోధించడం, సైబర్ పరిశుభ్రతను కాపాడుకోవడానికి ఉత్తమ పద్ధతులు, వ్యక్తిగత సంస్థాగత డేటాను రక్షించడానికి వ్యూహాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ప్రభు జి. బెనకోప్, డైరెక్టర్ లక్ష్మీపతిరావు, ఈసీఈ హెచ్ఓడీ ప్రొఫెసర్ వీఎస్ఎస్ఎన్ శ్రీనివాసబా, ఐక్యూఏసీ కో-ఆర్డినేటర్ రవి, ఎం. యాదహల్లి, డిపార్ట్‌మెంట్ ఆఫ్ టెలికమ్యూనికేషన్ డైరెక్టర్ కంప్లెయన్స్ ఎ. శ్రావణ్‌కుమార్, అసిస్టెంట్ డైరెక్టర్ పి. శ్యాంరాజు, సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్ ఎస్ఐ సీహెచ్ మహిపాల్‌లతో పాటు కళాశాల ఎంబీఏ విద్యార్థులు పాల్గొన్నారు.

గురువందనం భరత నాట్య నృత్యరూపకం

అరణ్యనాట్యం నృత్యఅకాడమీ వార్షికోత్సవాన్ని గురువారం రవీంద్రభారతిలోని మెయిన్‌హాల్‌లో 'ఆరణ్య నాట్యం-గురువందనం' భరత నాట్య నృత్యరూపకాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వక్తలుగా సంగీత నాటక అకాడమీ అవార్డు గ్రహీత నాట్యగురువు మంజుల, అరణ్య నృత్య అకాడమీ వ్యవస్థాపకురాలు ఎన్‌వీఎస్ సమతారావు విచ్చేసి శిష్యబృందంచే భరత నాట్య నృత్యరూపకాన్ని ప్రదర్శించి వీక్షకులను అలరించారు. సభకు ముందు భరతనాట్యకళాకారిణులు గణేశ పంచరత్న, దేవిస్తుతి, హనుమాన్ చాలీసా వంటి నృత్యప్రదర్శనలు నిర్వహించి వీక్షకులను అలరించారు. – రవీంద్రభారతి

కాజీపేట రైల్వేస్టేషన్‌లో స్నాచింగ్

కాచిగూడ, జనవరి 9: కాజీపేట రైల్వేస్టేషన్‌లో ఆగిఉన్న విశాఖరైల్లో నగదు, బంగారు ఆభరణాలను గుర్తుతెలియని వ్యక్తులు దొంగిలించారు. రైల్వే ఇన్‌స్పెక్టర్ ఎల్లప్ప వివరాల ప్రకారం.. ఈస్ట్‌గోదావరికి చెందిన పి.మాధవి విశాఖ రైల్లో కాచిగూడకు వస్తుండగా కాజీపేట రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫాం-3లో ఆగింది. ఇదే అదునుగా భావించిన గుర్తుతెలియని వ్యక్తులు ఆమె బ్యాగును లాక్కొని పారిపోయారు. అందులో 70 గ్రాముల బంగారు ఆభరణాలు, రూ.20 వేలు, ఖరీదైన 3 ఫోన్‌లు ఉన్నట్లు తెలిపారు. గురువారం కాచిగూడ రైల్వే పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకొని కాజీపేట రైల్వే పోలీస్‌స్టేషన్‌కు బదిలీ చేసినట్లు హెడ్‌కానిస్టేబుల్ సుబ్బారావు తెలిపారు.

నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో ఏర్పాటు చేసిన జైళ్ల శాఖ స్టాల్‌ను ప్రారంభిస్తున్న జైళ్ల శాఖ డీజీ సౌమ్య మిశ్రా

జైళ్ల శాఖ స్టాల్ ప్రారంభం

● ఖైదీలు రూపొందించిన ఉత్పత్తుల విక్రయాలు

అబిడ్స్, జనవరి 9 : అఖిల భారత పారిశ్రామిక ప్రదర్శనకు రోజు రోజుకూ సందర్శకుల సంఖ్య పెరుగుతోంది. ఈ నెల 3వ తేదీన ప్రారంభమైన నుమాయిష్‌కు నగర నలుమూలల నుంచి సందర్శకులు పెద్ద ఎత్తున తరలి వస్తుండడంతో ఎగ్జిబిషన్ సొసైటీ ఆధ్వర్యంలో సందర్శకులకు భద్రతా చర్యలను చేపడుతున్నారు. ఏడు రోజులుగా సందర్శకుల సందడి పెరుగుతూ వస్తోంది. గురువారం సందర్శకులు పెరగడంతో స్టాళ్లలో సందడి నెలకొంది.

జైళ్ల శాఖ స్టాల్‌ను ప్రారంభించిన డీజీ సౌమ్య మిశ్రా..

అఖిల భారత పారిశ్రామిక ప్రదర్శనలో జైళ్ల శాఖ స్టాల్‌ను ఆ శాఖ డీజీ సౌమ్య మిశ్రా ప్రారంభించారు. జైలు శాఖ స్టాల్‌లో తెలంగాణ అంతటా వివిధ జైళ్ల నుంచి ఖైదీలు రూపొందించిన ఉత్పత్తులను ప్రదర్శించేందుకు స్టాల్‌ను ఏర్పాటు చేశారు. ప్రతి సంవత్సరం ఈ స్టాల్‌ను ఏర్పాటు చేసి ఉత్పత్తులను ప్రదర్శించడంతో పాటు విక్రయాలు చేపడతారు. గురువారం జైళ్ల శాఖ డైరెక్టర్ జనరల్ సౌమ్య మిశ్రా, ఎగ్జిబిషన్ సొసైటీ కార్యదర్శి బి.సురేందర్‌రెడ్డి, సభ్యులు సుఖేష్‌రెడ్డి, అధికారులతో కలిసి స్టాల్‌ను ప్రారంభించారు. అనంతరం స్టాల్‌లోని ఉత్పత్తులను పరిశీలించి అడిగి తెలుసుకున్నారు. గత సంవత్సరం జైళ్ల శాఖకు చెందిన మై నేషన్ స్టాల్ 2024 ప్రభుత్వ రంగం నుంచి ఉత్తమ ప్రదర్శన స్టాల్ అవార్డుతో గుర్తింపు పొందగా, 20, 96, 133 అమ్మకాలను సాధించినట్లు అధికారులు వివరించారు. నుమాయిష్ 2025లో కూడా మైనేషన్ స్టాల్‌ను సందర్శించి మద్దతు ఇవ్వాలని అధికారులు ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ జైళ్లు(హైదరాబాద్ రేంజ్) డాక్టర్ డి శ్రీనివాస్, హైదరాబాద్ జైళ్ల శాఖ సూపరింటెండెంట్ ఎన్. శివకుమార్ గౌడ్, చర్లపల్లి జైలు సూపరింటెండెంట్ జి. రామచంద్రంతో పాటు వివిధ అధికారులు పాల్గొన్నారు.

మేరు క్రికెట్ లీగ్ సీజన్ 3 పోటీలు

రాజ్యసభ సభ్యుడు అనిల్‌కుమార్‌యాదవ్‌కు ఆహ్వాన పత్రిక అందజేస్తున్న మేరు సంఘం నాయకులు

అబిడ్స్, జనవరి 9 : మేరు కులానికి చెందిన యువ క్రీడాకారులలో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసి వారిని ప్రోత్సహించేందుకు మేరు సంఘం ఆధ్వర్యంలో మేరు క్రికెట్ లీగ్ సీజన్ 3 పేరుతో పోటీలను నిర్వహిస్తున్నామని మేరు సంఘం నాయకులు కీర్తి రాజగోపాల్, ఓదెల శేఖర్, డి. నర్సింగ్‌రావు అన్నారు. గురువారం ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్‌ను ఆయన కార్యాలయంలో కలిసి క్రికెట్ టోర్నమెంట్ పోటీలకు ముఖ్య అతిథిగా రావాలని ఆహ్వానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మేరు సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 11,12 తేదీలలో రెండు రోజుల పాటు మేరు క్రికెట్ లీగ్ సీజన్ 3 పేరుతో నిజాం కళాశాల మైదానంలో ఈ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నామని తెలిపారు. ఇప్పటికే క్రికెట్ టోర్నమెంట్‌కు మేరు కులానికి చెందిన 23 టీంల పేర్లను నమోదు చేసుకోవాలని కోరారు.

బీటీ రోడ్లకు మరమ్మతులు

గోల్నాక డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో దెబ్బతిన్న రహదారుకు ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ ఆదేశాల మేరకు గురువారం మరమ్మతులు నిర్వహించారు. ఈ పనులను జీహెచ్ ఎంసీ వర్క్‌ఇన్‌స్పెక్టర్ మనోహర్, స్థానిక బీఆర్ఎస్ నాయకుడు పోత్నక్ సంతోష్ తదితరులు పరిశీలించారు.

– గోల్నాక, జనవరి 9

దుస్తులు పంపిణీ

గోల్నాక డివిజన్ గంగానగర్, తులసీనగర్ కాలనీల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు గురువారం కార్పొరేటర్ దూసరి లావణ్యశ్రీనివాస్‌గౌడ్ ప్రభుత్వం అందించిన దుస్తులను పంపిణీ చేశారు. అనంతరం చిన్నారులకు అందించే మధ్యాహ్నం భోజనాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సీడీపీవో పావని, అధికారులు విజయలక్ష్మి, సరళ, ధనూజ, మంజుల, ఉమారాణి, వసంత, ధనలక్ష్మి, చందు, అరవింద్, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

– గోల్నాక, జనవరి 9

ప్రమాదాలను నివారించడం అందరి బాధ్యత

వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ సీఐ శ్రీనివాస్

కాచిగూడ, జనవరి 9: ప్రమాదాలను నివారించడంలో వాహనదారులు బాధ్యత వహించాలని కాచిగూడ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ఎ.శ్రీనివాస్ విజ్ఞప్తి చేశారు. రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా బర్కత్‌పుర తెలంగాణ యువతి మండలి వద్ద గురువారం కాచిగూడ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ఆధ్వర్యంలో పాదచారులకు జిబ్రా క్రాసింగ్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ట్రాఫిక్ సిగ్నల్స్ కూడలీల వద్ద పాదచారులు జిబ్రా క్రాసింగ్‌పై నడువాలని, రోడ్లపై వాహనదారులు ట్రాఫిక్ పోలీసులు సూచించిన రూల్స్ పాటిస్తే ఎటువంటి ప్రమాదాలు జరుగవని సూచించారు. ఈ కార్యక్రమంలో పీసీ గంగయ్య, వీరన్న, నరేశ్ పాల్గొన్నారు.

మహేశ్‌కుమార్ గౌడ్‌ను కలిసిన కాంగ్రెస్ నాయకులు

తెలంగాణ పీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేశ్ కుమార్ గౌడ్‌ను కలిసి సన్మానించిన కార్వాన్ కాంగ్రెస్ నాయకులు కూరాకు క్రిష్ణ, వెంకట్‌రెడ్డి తదితరులు.

– కార్వాన్, జనవరి 9

ప్రహరీని నిర్మించాలి..

కాచిగూడ డివిజన్ బర్కత్‌పురలోని కాశీరాంజీరాలో గ్రేవియార్డు ప్రహరీ కూలింది. విషయం తెలుసుకున్న కాచిగూడ కార్పొరేటర్ ఉమా, జీహెచ్ఎంసీ అధికారులతో గురువారం సందర్శించి వెంటనే ప్రహరీని నిర్మించాలని అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ ఏఈ ప్రశాంత్, రమేశ్‌యాదవ్, నరేశ్, రాము, భీంరాజ్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

– కాచిగూడ, జనవరి 9

టాలీవుడ్, హాలీవుడ్ చిత్ర పరిశ్రమల మధ్య వారధి అపర్ణ

సినీ రచయిత, దర్శకురాలు అపర్ణ మల్లాది చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న వక్తలు

తెలుగు యూనివర్సిటీ, జనవరి 9. టాలీవు, హాలీవుడ్ చలనచిత్ర పరిశ్రమల మధ్య మల్లాది అపర్ణ వారధిగా నిలిచారని వక్తలు కొనియాడారు. పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం రంగస్థల కళల శాఖ ఆధ్వర్యంలో ఇటీవల అమెరికాలో అనారోగ్యంతో మరణించిన అపర్ణ మల్లాది సంస్మరణ సభ పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీ ఆడిటోరియంలో గురువారం జరిగింది. ఈ సందర్భంగా అపర్ణ చిత్రపటానికి పూలమాల వేసి నివాళుర్పించారు. తెలుగు సినీ రచయితల సంఘం ఉపాధ్యక్షులు కె.ఎల్. ప్రసాద్ మాట్లాడుతూ.. సినిమా మాధ్యమాన్ని ఎంతగానో ప్రేమించిన వ్యక్తి అపర్ణ అని పేర్కొన్నారు. సినీ రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి అనూరాధ ఉమర్జి మాట్లాడుతూ తెలుగు సినిమా భారతీయ సినిమా ప్రపంచ వేదిక మీద గొప్పగా వ